సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024

సిరులతల్లికి నీరాజనం




శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పూజలు అత్యంత వైభవంగా జరిగాయి.

8లో

కూటమి మాటలకెన్నో అర్థాలున్నాయి. నోటినిండా అబద్ధాలే ఉంటాయి. . ఎండమావులెలా దప్పిక తీర్చవో.. చంద్రబాబు సర్కారు హామీలు కూడా అదే మాదిరిగా మారిపోయాయి. సూపర్ సిక్స్ పేరుతో 'మాయ'ఫెస్టో తీసుకొచ్చి.. హామీల వర్షం కురిపించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కూటమి... ప్రతి విషయంలోనూ ప్రజల నెత్తిన టోపీ పెడుతోంది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా.. అన్నీ మోసాలే తప్ప.. ఏ ఒక్క వర్గాన్నీ సంతోషపరిచింది లేదు. రైతులు, **మహిళలు, చిరుద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, యువత, ఆశా వర్కర్లు,** అంగన్‌వాడీ **కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు,** రియల్ వ్యా**పారులు.. ఇలా.. ప్రతి ఒక్కరినీ రోడ్డున పడేసింది.**

6 నెలలు.. అన్నీ మోసాలే



- సూపర్–6 పేరుతో ప్రజలకు నయవంచన
- అన్నాక్యాంటీన్లు, సింగిల్ సిలిండర్, వెయ్యి పింఛను పెంపుతో సరి
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వీర్యం
- పడకేసిన విద్య, వైద్యం, సంక్షేమ రంగాలు
- అడుగడుగునా జిల్లాను దగా చేసిన కూటమి సర్కారు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన హామీలన్నీ తుంగలో తొక్కారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఫీజు రీయింబర్స్‌మెంట్, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం వంటి హామీలన్నీ గాలికొదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని కూటమి సర్కారు ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది.

ఏదీ.. తల్లికి వందనం



వైఎస్సార్‌సీపీ హయాంలో అమ్మ ఒడి పేరుతో విద్యార్థులకు ఏటా రూ.15,000 చొప్పున అందించింది. అయితే బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయమన్న చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ ఏడాది తల్లికి వందనం ఇవ్వలేమంటూ ప్రకటించారు. తల్లులంతా ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

ఫ్రీ సిలిండర్ కొందరికే..



ప్రతి ఇంటికీ ఏడాదికి 3 సిలిండర్లు ఇస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం.. ఈ ఏడాది ఒక్కటే సిలిండర్ ప్రకటించింది. దానికి కూడా షరతులు వర్తిస్తాయని తెగేసి చెప్పేసింది. జిల్లాలో మొత్తం 8,90,341 గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో కేవలం 2,84,142 మందికి మాత్రమే సింగిల్ సిలిండర్లు ఫ్రీగా ఇచ్చేసి చేతులు దులిపేసుకుంది. ఇందులోనూ రాయితీ మొత్తం కేవలం 2,77,718 మందికి మాత్రమే విడుదల చేసింది. అంటే మొత్తం సిలిండర్లు రాయితీ కింద రూ.22.57 లక్షలు ప్రజలకు ఇవ్వాల్సి ఉండగా.. రూ.22.06 లక్షలు మాత్రమే జమ చేసి.. మిగిలిన వారికి ఇప్పటి వరకూ చెల్లించలేదు.

నిరుద్యోగులకు ఆశాభంగం?



2014లో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసి, ఈ ఎన్నికల్లోనూ అదే హామీని ప్రధానంగా తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా.. దీనిపై కనీసం సమీక్ష చేయలేదు. జిల్లాలోని 11 మండలాల పరిధిలో 5.45 లక్షల ఇళ్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ, లిమిటెడ్ కంపెనీల పరిధిలోనూ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య సుమారు 3.40 లక్షల మంది ఉంటారు. అంటే మిగిలిన 2.05 లక్షల ఇళ్లలో ఉన్న నిరుద్యోగులకు భృతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడేమో స్కిల్ సర్వే నిర్వహిస్తున్నామని, భృతి ఇవ్వడం ఇప్పుడప్పుడే సాధ్యం కాదని సర్కారు మాట మార్చేస్తోంది.

విద్యార్థులపై 'ఫీజు' భారం..



కూటమి ప్రభుత్వంలో పేదోడికి చదువు భారంగా మారింది. ఇంటర్ చదివి ఆపై ఉన్నత చదువులు అభ్యసించే ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ విద్యార్థులపై ఫీజుల భారం పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించడంతో పేద విద్యార్థులంతా ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఉన్నత చదువుల కోసం చేరారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఫీజు రియింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులపై ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఫీజు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో సగంలోనే చదువులు ఆగిపోవడంతో అప్పులు చేసి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

రైతుకు అండగా వైఎస్సార్‌సీపీ



నేడు రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు పాదయాత్ర

ఖరీఫ్, రబీ సమయమేదైనా గత ఐదేళ్లపాటు చిరునవ్వులతో పంటలు పండించిన అన్నదాతలు.. ఇప్పుడు కన్నీటితో సావాసం చేస్తున్నారు. సకాలంలో ఎరువులు అందక.. బీమా ఉందన్న ధీమా లేక దిగాలు చెందుతున్నారు. పంట సాయం దూరమై.. చివరికి ధాన్యం కొనుగోళ్లలోనూ సర్కారు సహకారం లేకపోవడంతో రైతుల జీవితం దైన్యంగా మారిపోయింది. ఈ తరుణంలో అన్నదాతకు అండగా నిలిచేందుకు.. రైతు గొంతుకై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వైఎస్సార్‌సీపీ నడుం బిగించింది. 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరుతో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. శుక్రవారం జిల్లా పరిషత్ జంక్షన్‌లోని కృష్ణ మందిరం నుంచి కలెక్టరేట్ వరకూ పాదయాత్ర నిర్వహించనుంది. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, గుడివాడ్ అమర్‌నాథ్ నేతృత్వంలో రైతులతో కలిసి పార్టీ నేతలు, కార్యకర్తలు పాదయాత్ర అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నారు.

ఫ్రీ బస్ ఎక్కడ.?



మహిళలు ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా వెళ్లొచ్చంటూ ఎన్నికల సమయంలో బాకాలు ఊదిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఫ్రీ బస్ పథకం దసరా కానుక.. దీపావళి కానుక.. అంటూ ఎప్పటికప్పుడు వాయిదాలు వేసేస్తూ.. సంక్రాంతి తర్వాత చూద్దామంటూ హామీని ఫ్రీగానే అటకెక్కించేశారంటూ మహిళలు తిట్టిపోస్తున్నారు.

మహిళలకు ఏం చెబుతారు?



గత ప్రభుత్వంలో మహిళలకు చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పేరిట సాయం అందేది. ఏ విధమైన పింఛన్ రాని 18 ఏళ్లు దాటిన మహిళలదరికీ నెలకు రూ.1500 చొప్పున అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మహిళలకు ఏమిచెబుతారు బాబూ.

ఇలా ఏ వర్గాన్ని కదిలించినా.. ప్రభుత్వం వంచించిన తీరే సాక్షాత్కారమవుతోంది. ప్రజల్ని మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు పోరాట బాట పట్టారు. ఈ నెల 13న రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం, ఈ నెల 27వ తేదీన విద్యుత్ చార్జీల మోతపై ఎస్ఈకు వినతిపత్రం, జనవరి 3న విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్‌పై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నారు.

గ్రీన్ బెల్ట్‌ను మింగేసి..



గ్రీన్ బెల్ట్ ఫెన్సింగ్‌ను తొలగించి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్న షాపింగ్ మాల్ యాజమాన్యం

కూటమి ప్రభుత్వంలో పర్యావరణానికి పాతరేస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలకు పూనుకుంటున్నారు. నగర శివార్లలోనే కాదు జాతీయ రహదారికి అనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను మింగేసి మరీ భారీ షాపింగ్ మాల్ కట్టేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో బిర్లా జంక్షన్ సమీపంలో జాతీయ రహదారికి అనుకొని ఉన్న స్థలంలో భారీ వృక్షాలను నరికేసి, గ్రీన్‌బెల్ట్ మీదే కాంక్రీట్ రోడ్డు వేసేసి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులెవరూ అటువైపుగా కన్నెత్తి చూడకుండా ఉండేందుకు తెలివిగా ముఖ్యమంత్రి, ఇతర ప్రజాప్రతినిధుల కటౌట్లు పెట్టి అది కూటమి నేతలకు సంబంధించిన నిర్మాణంగా కలరింగ్ ఇస్తూ చెలరేగిపోతున్నారు. అధికారులు సైతం మామూలు (రా)గానే కళ్లు మూసుకుని చోద్యం చూస్తున్నారు.

- కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో ఏఎస్ఎస్ మెగా మాల్ కన్‌స్ట్రక్షన్
- సీఎం, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టి నిబంధనలకు తూట్లు
- మామూళ్ల మత్తులో కళ్లుమూసుకున్న అధికారులు
- బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఫిర్యాదుతో హాట్‌టాపిక్‌గా మారిన అంశం

విశాఖ సిటీ : బిర్లా జంక్షన్ సమీపంలో ఏఎస్ఎస్ మెగా మాల్ నిర్మాణం జరుగుతోంది. ఇందులో షాపింగ్, గేమింగ్, ఎంటర్‌టైన్మెంట్, మల్టీప్లెక్స్ థియేటర్లు, ఆఫీస్ స్పేస్, ఫంక్షన్ హాల్, రెస్టారెంట్, కేఫ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు ఈ మాల్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఇక్కడ గ్రీన్‌బెల్ట్‌ను కప్పేసి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వరకు 40, 60 అడుగుల వెడల్పుతో నాలుగు రోడ్లు వేశారు. గ్రీన్ బెల్ట్ పరిరక్షణ కోసం జీవీఎంసీ వేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతోపాటు ఆ ఏరియా మొత్తాన్ని కలిపేసుకొని మరీ బౌండరీ వాల్ నిర్మాణం చేపట్టారు. అందులో కల్వర్టులు, డ్రైనేజీలు నిర్మించారు. గ్రీన్ బెల్ట్‌లో గత ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలు, అభివృద్ధి చేసిన పార్కులను ధ్వంసం చేశారు. గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా.. జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం.

కళ్లు మూసుకున్న అధికారులు

జాతీయ రహదారిలో గ్రీన్‌బెల్ట్‌ను కప్పేసి, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని భారీ మాల్ నిర్మిస్తున్నా జీవీఎంసీ అధికారులు కళ్లుమూసుకునే ఉన్నారు. కొన్ని నెలలుగా ఈ అక్రమ నిర్మాణం జరుగుతున్నా అధికారులు అటువైపుగా కనీసం కన్నెత్తి చూడలేదు. మామూళ్ల మత్తులో జోగుతూ నిర్మాణదారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నిర్మాణాలపై ఇప్పటికే పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు.

బీజేపీ ఎమ్మెల్యే ఫిర్యాదుతో..

కూటమి ప్రజాప్రతినిధుల అండదండలతో గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి చేపడుతున్న ఈ మెగా మాల్ అక్రమ నిర్మాణంపై బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఫిర్యాదు చేయడం ఇప్పుడు చర్చనీయంశమవుతోంది. గ్రీన్‌బెల్ట్‌ను దెబ్బతీసి, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని మాల్ నిర్మాణం చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. గ్రీన్ బెల్ట్, ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై ఫైన్ విధించడంతోపాటు భూకబ్జా నేరం కింద కేసులు నమోదు చేయాలని ఆ ఫిర్యాదులో కోరారు. గ్రీన్ బెల్ట్‌లో మొక్కల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో అధికారుల్లో కదలిక వచ్చింది. వెంటనే ఆ నిర్మాణాలు తొలగించేందుకు జేసీబీని సైతం పంపించారు. తీరా అక్కడకు వెళ్లిన తరువాత కేవలం కాంపౌండ్ వాల్, కల్వర్టు, కొంచెం విస్తీర్ణంలో మాత్రమే రహదారిని తొలగించి చేతులు దులుపేసుకున్నారు. అంతేకాని వారికి ఎటువంటి ఫైన్లు వేయలేదు. కేసులు నమోదు చేయలేదు. ఒక ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినప్పటికీ తూతూ మంత్రంగానే చర్యలు తీసుకొని వెనక్కి వచ్చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గ్రీన్ బెల్ట్‌లో రహదారుల నిర్మాణం



గ్రీన్ బెల్ట్‌లో నిర్మాణాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కూటమి ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విశాఖలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. శివారు ప్రాంతాల్లోనే కాకుండా కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డును ఆనుకొని ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొన్ని, సీఆర్‌జెడ్ అనుమతులు లేకుండా మరికొన్ని కట్టడాలు జరుగుతున్నాయి. బిర్లా జంక్షన్ సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొని పర్యావరణాన్ని దెబ్బతిస్తూ భారీ షాపింగ్ మాల్ నిర్మాణం జరిగిపోతోంది. కూటమి ప్రజాప్రతినిధుల ఆశీర్వాదాలతో ఈ తరహా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూటమి ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు పెట్టి..



నిర్మాణ స్థలంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలు

గతంలో నిర్మాణాలపై ఎవరి కళ్లు పడకుండా ఉండడం కోసం దిష్టిబొమ్మలు పెట్టుకునేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. ప్రతి అక్రమ, అనధికార నిర్మాణాల ముందు కూటమి ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు, కటౌట్లు పెడుతున్నారు. ఇదే తరహాలో జాతీయ రహదారికి ఆనుకొని గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి జరుగుతున్న ఏఎస్ఎస్ మెగా మాల్ నిర్మాణం వద్ద కూడా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బొమ్మ పెట్టుకొని మరీ పర్యావరణానికి పాతరేసి గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడం విశేషం. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన పవన్ కల్యాణ్, అతని పార్టీ ఎమ్మెల్యేలు ఈ అక్రమ నిర్మాణంపై ఇప్పటివరకు దృష్టి పెట్టకపోవడం గమనార్హం. నగరంలో జరుగుతున్న ప్రతి అక్రమ నిర్మాణాల వద్ద కూటమి ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు, కటౌట్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ కటౌట్లు ఉన్న నిర్మాణాలన్నీ అక్రమమే అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కార్పొరేటర్ గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలి

సచివాలయ ఉద్యోగుల ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సీతమ్మధార : సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తక్షణం క్షమాపణలు చెప్పాలని సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నూలపాటి వరప్రసాద్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం రాత్రి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను అవమానపరిచే విధంగా బుధవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కాకి గోవిందరెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. వేలుకు వేలు జీతం తీసుకుంటూ ఖాళీగా ఉంటున్నారని వ్యాఖ్యానించడం ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడి, అవమానాలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ సుజిత మాట్లాడుతూ తమ శ్రమను గుర్తించక పోయినా పరవాలేదు కానీ అవమానపరిచేలా చేయవద్దని కోరారు. కార్పొరేటర్ చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నల్ల రిబ్బన్లు ధరించి, మొబైల్‌ఫోన్లలో ఫ్లాష్‌లైట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

మేళా భళా

- ఆలోచన రేకెత్తించిన ఆర్గానిక్ మేళా
- పల్లె వాతావరణం ప్రతిబింబించేలా స్టాళ్లు
- ఉత్పత్తుల కొనుగోళ్లపై ప్రజానీకం ఆసక్తి

విశాఖ విద్య : ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోంది. గో ఆధారిత ఎరువులతో పండించిన ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించారు. కూరగాయలు, చిరుధాన్యాలు, గానుగ నూనె, బెల్లం ఇలా ఇంటిల్లిపాదికి అవసరమైన నిత్యావసరాలను సైతం ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటిని కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఎంతగానో ఆసక్తి చూపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించటమే లక్ష్యంగా ఆర్గానిక్ మేళా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 15 వరకు మేళా అందుబాటులో ఉంటుందన్నారు.



నూనె ఆడే గానుగ



మేళాలో మట్టి కుండల తయారీ



రోకలి దంచుతున్న విద్యార్థినులు



కూరగాయల స్టాళ్ల వద్ద..



మిల్లెట్ వస్తువులతో స్వాగతం ముగ్గు



పల్లె వాతావరణం ప్రతిబింబించేలా..

క్లుప్తంగా

బాలికపై లైంగిక దాడి

బీచ్‌రోడ్డు: బాలికను మాయమాటలతో నమ్మించి, లైంగిక దాడికి పాల్పడ్డ యువకుడిపై మూడో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి సీఐ రమణయ్య అందించిన వివరాలు. చిన వాల్తేరు ప్రాంతానికి చెందిన పి.ధనేష్(20) కొంతకాలంగా అదే ప్రాంతానికి చెందిన బాధిత బాలికను రోజూ వెంబడిస్తూ, వేధిస్తున్నాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా వేధింపులకు గురిచేస్తుండడంతో విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తులు

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నిషియన్‌గా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు నేక్ అసిస్టెంటు డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్/ఐటీఐ/డిప్లమో ఉత్తీర్ణత కలిగిన వారికి ఈ కోర్సులో మూడు నెలల కాలంలో శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం సంబంధిత విభాగాల్లో ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు యువత అర్హులని, ఇతర వివరాలకు 8309003957 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

చలి చంపేస్తోంది

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో చలి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. జి.మాడుగులలో 14.1, ముంచంగిపుట్టులో 14.2 డిగ్రీలు నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్‌లోని పెదబయలు, అనంతగిరిలో 14.3, అరకు వ్యాలీలో 14.9, డుంబ్రిగుడలో 15.1, పాడేరులో 15.7, హుకుంపేటలో 15.8, చింతపల్లిలో 16.0, గూడెంకొత్తవీధిలో 16.8 డిగ్రీలు నమోదైనట్టు ఆయన వివరించారు.

సిరులతల్లికి నీరాజనం

- వైభవంగా రెండో గురువారం పూజలు
- కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


పంచామృతాభిషేక సేవలో ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు


టౌన్‌కొత్తరోడ్డు వరకు అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, సిరులతల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా రెండో గురువారం పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీహోమం, విశేష పూజలు చేశారు. పసుపు కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి బుధవారం అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వెండి కవచం తొడిగారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పోలీస్ శాఖ, రెవెన్యూ, దేవదాయ ధర్మాదాయశాఖ ఉద్యోగులు, జీవీఎంసీ సిబ్బంది అమ్మవారి సేవలో పునీతులయ్యారు. గురువారం రాత్రి వరకు 40 వేలమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐదు వేల మందికి అన్నదానం

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో రెండో గురువారం ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.


దర్శన క్యూలైన్లు ఇలా..

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతోపాటు రూ.100, రూ.200 క్యూలైన్ల టికెట్లు అక్కడే అందజేశారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుక భాగం, ఆలయ ప్రధాన ద్వారం (వీటి కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం, మజ్జిగ అందజేశాయి. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాస్పత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. ఆలయం వెనుక భాగం ద్వారా వృద్ధులు, దివ్యాంగులకు ఎన్‌క్లేవ్ ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు టౌన్‌కొత్తరోడ్డు దాటి జగన్నాథస్వామి ఆలయం కొనసాగాయి.

ట్రాఫిక్ మళ్లింపు..

భక్తుల రద్దీ దృష్ట్యా జగదాంబ జంక్షన్ మీదుగా పాత పోస్టాఫీస్ వెళ్లే వాహనాలను టౌన్‌కొత్తరోడ్డు వద్ద కుడివైపు తిరిగి సూయిజ్‌ఫాం ముందు రోడ్డు నుంచి కురుపాం మార్కెట్ మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగ వాహనాలతో వచ్చే వారిని సీహార్స్ జంక్షన్ నుంచి ఎడమవైపునకు తిరిగి గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా వాహనాలు మళ్లించారు.

దీక్షాధారులతో పులకించిన సింహగిరి


అప్పన్న సన్నిధిలో దీక్షాధారులు

- 32 రోజుల నృసింహ దీక్షల స్వీకరణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన దీక్షాధారులు


తులసిమాలలతో దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: నృసింహ దీక్షాధారులతో సింహగిరి పులకించింది. ఈ నెల 2వ తేదీన 41 రోజుల దీక్షలు ప్రారంభం కాగా..గురువారంమరికొందరు భక్తులు 32 రోజుల పాటు దీక్ష ధరించారు. సింహగిరికి వచ్చిన సుమారు ఎనిమిదివందల దీక్షాధారులకు ఉదయం సింహాచలం దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు. ఆలయ రాజగోపురం పక్కన మాడవీధిలో ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేసి వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రతిమను ఉంచారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అర్చకులు, అధికారులు మేళతాళాలు, వేద మంత్రోశ్చరణల మధ్య ఆలయంలోంచి తులసి మాలలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకొచ్చారు. స్వామి చెంతన తులసి మాలలను ఉంచి అర్చకులు విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామివారి అష్టోత్తర శతనామావళిని దీక్షాధారులందరిచేత పఠింపజేశారు. అనంతరం దీక్షాధారులకు మాలధారణ చేశారు. దీక్షానియమాలను వివరించారు. స్వామివారి తులసి మాలలను, ప్రతిమలను ఉచితంగా అందజేశారు. స్వామివారి దర్శనాన్ని ఉచితంగా కల్పించారు. అన్నప్రసాద భవనంలో దీక్షధారులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ఉపప్రధానార్చకుడు ప్రసాదాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు పాల్గొన్నారు. ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. జనవరి 12వ తేదీన దీక్షవిరమణ ఉంటుందని దేవస్థానం ఈవో ప్రకటించారు. ఆరోజు దీక్షా విరమణ, శాంతి కల్యాణం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

పారిశ్రామిక భద్రతకు సమష్టి కృషి


సీఐఐ సదస్సులో పాల్గొన్న వివిధ పరిశ్రమల ప్రతినిధులు

కొమ్మాది: పారిశ్రామిక భద్రతను పెంపొందించి రాష్ట్రాన్ని సుస్థిర వృద్ధికి నమూనాగా మార్చుదామని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఆదిత్య బిర్లా గ్రూప్ అధ్యక్షుడు, యూనిట్ హెడ్ నరసింహ శాస్త్రి అన్నారు. రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ కాన్ఫరెన్స్–2024 కార్యక్రమం గురువారం సాగర్‌నగర్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగింది. సీఐఐ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాలలో మార్పు తీసుకువచ్చే శక్తి, విశ్వాసం, సహకారాన్ని పెంపొందించుకోవాలన్నారు. మానవలోపాలను సరిదిద్ది, కార్యాచరణను మెరుగుపరచాలన్నారు. సీఐఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ నారాయణరాజు మాట్లాడుతూ పారిశ్రామిక కార్యకలాపాలలో భద్రత, ప్రణాళికల ప్రాముఖ్యతను తెలియజేశారు. 189 గ్లోబల్ కెమికల్ ప్రమాదాలపై యూకే అధ్యయనాన్ని ప్రస్తావించారు. ప్రాపర్టీలను తప్పుగా చార్జ్ చేయడం వలన 21 శాతం తప్పులు జరిగినట్లు తెలిపారు. ఈ సదస్సులో సీఐఐ హెడ్ వీఎం మౌళి, చైర్మన్ రాజేష్ గ్రంధి, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణన్, సీఐఐ ఏపీ చైర్మన్ వి.మురళి పాల్గొన్నారు.

ముగిసిన గిరిజన యువజన సమ్మేళనం


సర్టిఫికెట్లతో విజేతలు

కొమ్మాది: గీతం విశ్వవిద్యాలయం వేదికగా వారం రోజుల పాటు నిర్వహించిన 16వ జాతీయ గిరిజన యువజన సమ్మేళనం గురువారం ముగిసింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 5 జిల్లాల నుంచి 200 మంది ఆదివాసీ యువత సమ్మేళనంలో పాల్గొంది. ఇందులో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు ఆన్షుమన్ దాస్, హోం మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

సార్ట్ బ్రాంచ్‌ను సందర్శించిన సామ్రో డీజీఎం


మొక్క నాటుతున్న సామ్రో డీజీఎం కేజీ రావు

విశాఖ సిటీ: స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ రీజనల్ ఆఫీస్ (సామ్రో) డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.జి.రావు గురువారం సిరిపురం ప్రాంతంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్ (సార్బ్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రికవరీలో ఈ బ్రాంచ్ అద్భుత ప్రతిభ కనబరిచిందని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా అత్యధిక రికవరీలు సాధించాలని బ్రాంచ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. బ్రాంచ్ హెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.విజయలక్ష్మిని, సిబ్బందిని అభినందించారు. అనంతరం బ్రాంచ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సార్బ్ చీఫ్ మేనేజర్లు బి.వరప్రసాద్, వై.శ్రీకాంత్, వై.కిరణ్‌చంద్, ఇతర బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై వినతుల స్వీకరణ

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ఉప–వర్గీకరణపై విచారణకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం నియమించిందని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. ఎస్సీ ఉప–వర్గీకరణపై వినతిపత్రాలు ఇవ్వొచ్చని తెలిపారు. ఏకసభ్య కమిషన్ కార్యాలయం గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయ, మొదటి అంతస్తు, కోనేరు లక్ష్మయ్య వీధి, మొఘల్రాజపురం, విజయవాడ–520 010లో ఉందన్నారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వ్యక్తిగతంగా లేదా తిరుగు రశీదుతో కూడిన రిజిస్టరు పోస్టు ద్వారా వినతిపత్రాలు జనవరి 9లోగా పంపించవచ్చని వివరించారు. omcscsubclassification@gmail.comకు మెయిల్ కూడా చేయవచ్చన్నారు.

నేవీ మారథాన్‌కు ఏర్పాట్లు

విశాఖ స్పోర్ట్స్: నేవీ మారథాన్‌కు సాగర తీరం సిద్ధమైంది. ఈనెల 15వ తేదీన సాగర తీరం వెంట మారథాన్ పరుగు జరగనుంది. మారథాన్‌తో పాటు హాఫ్ మారథాన్, పది కిలోమీటర్ల పరుగును నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందించనుండగా ఔత్సాహికులకు ఐదు కిలోమీటర్ల మేర ఫన్ రన్ నిర్వహించనున్నారు. ఆర్‌కే బీచ్ సమీపంలోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ఈ మారథాన్ ఆరోజు తెల్లవారుజామున 4.15 గంటలకు ప్రారంభం కానుండగా 5 కిలోమీటర్ల పరుగు ఉదయం 6.15 గంటలకు ప్రారంభించనున్నారు. పరుగులో పాల్గొనే వారి కోసం ఐదు అంబులెన్సులను, 12 మెడికల్ స్టేషన్లను తీరం వెంట ఏర్పాటు చేయనున్నారు. ఆరు మెడికల్ మొబైల్ టీమ్‌లను అందుబాటులో ఉంచనున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ప్రకృతి ఆధారిత పంటలను ఆదరించాలి

- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్
- ఏయూ గ్రౌండ్‌లో ఆర్గానిక్ మేళా
- గో ఆధారిత పంట నమూనాల ప్రదర్శన


గోవు నమూనా వద్ద యువతులు


మేళా ప్రారంభోత్సవంలో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖ విద్య: ప్రకృతి ఆధారిత పంటలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ కోరారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. మేళా నిర్వాహకులతో కలిసి స్టాళ్లను తిలకించారు. గో ఆధారిత పంటల నమూనాలను ప్రదర్శించటం పట్ల ఆయన నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి ఆధారంగా పండిన పంటలు ఆహారంగా తీసుకోవాలని కోరారు. నగరవాసులు ఆర్గానిక్ మేళాను సందర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పంటలు పండించే వారికి సహకరించాలని కోరారు. దేశీయ విత్తన సంపత్తిని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.మాధవ్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు.. భూమిని, పంటలను, నీటిని కాలుష్యం చేసి సమస్త జీవరాశిని నాశనం చేస్తున్నాయన్నారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం మాత్రమే సరైన మార్గం అన్నారు. రైతు సాధికారత సంస్థ రాష్ట్ర థీమేటిక్ లీడర్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి ఆధారిత పంటలు విరివిగా పండించాలని, ఇందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఈనెల 13న మీ ఆరోగ్యం మీ చేతిలో, 14న ఫుడ్ ప్రాసెసింగ్, 15న మిద్దె తోటలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.ఎల్.ఎన్.రాజు, జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్, నాదెళ్ల జ్యోతి, పైడంనాయుడు, వలంటీర్స్ పాల్గొన్నారు.

ఆ 11 మందిని విధుల్లోకి తీసుకోవాలి


ధర్నా చేస్తున్న వీఎంఆర్‌డీఏ కార్మికులు

సీతమ్మధార: వీఎంఆర్‌డీఏ పరిధిలో కైలాసగిరి, ఎన్టీఆర్, వీఎంఆర్‌డీఏ పార్కు, డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి సెంట్రల్ పార్కు, తెన్నేటి పార్కులో 25 ఏళ్లగా పనిచేస్తున్న 11 మంది కార్మికులను 60 ఏళ్లు నిండిన కారణంగా విధుల నుంచి తొలగించారు. వీరంతా సొసైటీ కార్మికులని..తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తొలగించిన సిబ్బందితో కలిసి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా 11 మందిని తొలగించడం అన్యాయమన్నారు. దీంతో వీరంతా రోడ్డున పడ్డారన్నారు. 11 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సంస్థ చైర్మన్, కమిషనర్లను కోరినా స్పందించలేదన్నారు. తక్షణం వీరిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు రాంబాబు, డి.నరసింగరావు, అప్పారావు, వి. అప్పారావు, చిన్నారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.79,470
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,850
వెండి(కిలో):	రూ.1,04,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం ధర	:రూ.93
బ్రాయిలర్ (లైవ్)	:రూ.113
స్కిన్	:రూ.196
స్కిన్‌లెస్	:రూ.206

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	620.00
విజయనగరం	624.00
శ్రీకాకుళం	624.00

అ'పూర్వ' కలయికకు 50 ఏళ్లు


తరగతి గదిలో ఆంధ్ర యూనివర్సిటీ 1971-75 బీ-ఫార్మసీ బ్యాచ్ విద్యార్థులు

విశాఖ విద్య: చదువుకున్న కళాశాలను 50 ఏళ్ల తరువాత సందర్శించారు. తమను ఉన్నతంగా తీర్చిదిద్దిన చదువుల కోవెలను తనవితీరా చూసి పులకించిపోయారు. తరగతి గదిలో నాడు కూర్చొన్న చోటనే కొద్దిసేపు ఆశీనులై జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మళ్లీ విద్యార్థుల అవతారమెత్తారు.కాలేజీలో ప్రస్తుతం జరిగే కార్యక్రమాల వివరాలను అధ్యాపకులనుంచి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గురువారం చోటుచేసుకున్న సన్నివేశాలు ఇవి. ఆంధ్రా యూనివర్సిటీ 1971–75 బీ–ఫార్మసీ బ్యాచ్ విద్యార్థులు గురువారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు వర్సిటీ క్యాంపస్, అప్పట్లో వారు ఉన్న హాస్టళ్లు, తరగతి గదులు, ప్రయోగశాలలను తిలకించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలోని మొక్కలు నాటారు. ఎం.ఫార్మసీ విద్యార్థులతో సంభాషించి అనుభవాలను పంచుకున్నారు. ఫార్మసీ పాత భవనంలో పునర్నిర్మించిన గ్యాలరీలో రిటైర్డ్ ప్రొఫెసర్లు డి.వెంటారావు, ఎల్.నరసింగరావు, ఎల్.నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజా శంకర్ ఆధ్వర్యంలో అధ్యాపకులంతా కలిసి పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

జనవరి 10న అప్పన్న వైకుంఠద్వార దర్శనం

ఏర్పాట్లపై ఈవో సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వచ్చే నెల 10న సింహాచల శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వైకుంఠద్వార దర్శనం ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సింహాచలం దేవస్థానం సెక్షన్ హెడ్‌లతో ఈవో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి వైకుంఠద్వార దర్శనం ఉత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీత వేస్తున్నట్టు తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఉత్తర ద్వార దర్శనం సమయాలు, వైదిక కార్యక్రమాలు, వేదిక అలంకరణ, విద్యుద్దీపాలంకరణ, మంచినీటి సదుపాయం, క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటు, అన్నప్రసాదం వితరణ, పారిశుధ్య ఏర్పాట్లు, సేవా వలంటీర్లు, ఉద్యోగుల విధులు తదితర అంశాలపై చర్చించారు. త్వరలోనే అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈ హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తీరంలో తాబేళ్ల మృత్యు ఘోష

బయటపడిన నాలుగు కళేబరాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట తీరం వద్ద గురువారం సాయంత్రం తాబేళ్ల కళేబరాలు తీరానికి కొట్టుకొచ్చాయి. మత్స్యకారులు తమ బోట్లను చూసుకునేందుకు వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా నాలుగు తాబేళ్ల కళేబరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. తాబేళ్లన్నీ భారీ స్థాయిలో ఉండటంతో పాటు వాటి కాళ్లకు తాళ్లు కట్టి ఉండడాన్ని గమనించారు. సముద్రంలో వలకు చిక్కి మృతి చెందాయా, లేక ఎవరైనా ఆకతాయిలు తాళ్లుకట్టి చంపేసి ఇక్కడ పడేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


తీరానికి కొట్టుకుని వచ్చిన తాబేళ్ళ కళేబరాలు